



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 10 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 218 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY SEPTEMBER 10 2026 | VOL:18 | ISSUE: 218 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

# ఫాంహౌస్ కుట్రపై ఉక్కుపాదం!

### కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిపైనా చర్యలు

### అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశం

### విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్

### దళితులను అవమానించడం.. అల్లర్లు రెచ్చగొట్టడం నేరం

### కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రకు ప్రణాళిక: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. మూడు రోజులుగా చోటుచేసుకున్న ఘటనల వెనుక కుట్ర కోణంపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు దాన్ని అమలు చేసిన వారినీ చట్టపరంగా శిక్షించాలని నిర్ణయించినట్లు సీఎం వెల్లడించారు.

కుట్రపై సమగ్ర విచారణ

అసెంబ్లీలో జరిగిన ఘటనలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. విచారణ అధికారిగా ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ నెల 6న ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని, 7న స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని, 8న శుద్ధి కార్యక్రమం చేపట్టారని సీఎం పేర్కొన్నారు. ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు కుట్రకు పాల్పడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేసీఆర్ కుట్ర పన్నారు

ప్రజా సమస్యలపై చర్చించేందుకే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 22ఏ భూములు సహా పలు కీలక అంశాలపై చర్చ జరగాల్సి ఉందన్నారు. ఈ అంశాలపై చర్చ జరిగితే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే సమావేశాలను అడ్డుకునేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పిలిపించి కుట్రకు ప్రణాళిక రూపొందించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

దళితులపై దాడులను సహించం

దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని సీఎం అన్నారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుట్రదారులను, అమలు చేసిన వారిని కోర్టు ముందు నిలబెట్టి శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఉత్తరాఖండ్ ఘటనను ప్రస్తావించిన సీఎం

ఉత్తరాఖండ్‌లో గతంలో జరిగిన ఘటనను ఖండిస్తూ రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అదే తరహా

(మిగతా 2వ పేజీలో..)

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

### గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

### 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ

### తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు

### దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత

### రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో

(మిగతా 2వ పేజీలో..)

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

### అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్

### బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు



తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని,

(మిగతా 2వ పేజీలో..)

## అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు షాక్.. కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

### ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన

### సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ

### బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం

### సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు

### అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది.సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.



## E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

### E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్

### తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి

### ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు



## విజయ్ కూటమికి కొత్త పేరు.. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'

### తమిళనాడు సీఎం విజయ్ కూటమికి కొత్త పేరు ఖరారు

### కూటమి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్న సీఎం విజయ్

### సమన్వయ సమావేశానికి దూరంగా వామపక్ష పార్టీలు

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ నేతృత్వంలోని అధికారిక కూటమికి నూతన పేరు ఖరారైంది. ఈ కూటమికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" (ఎస్ఎస్‌జేవీఏ)గా నామకరణం చేశారు. చెన్నై పనైయూర్‌లోని టీవీకే

(మిగతా 2వ పేజీలో..)





విజయకేరటం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

### పట్టణాల అభివృద్ధి.. ప్రజల జీవన ప్రమాణాలే కొలమానం!

నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయంటే కేవలం ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, మెరిసే కార్యాలయాలు కనిపించడం మాత్రమే కాదు. అక్కడ నివసించే సామాన్య ప్రజలకు జీవితం ఎంత సులభమైంది? వారికి తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు ఎంత మెరుగయ్యాయి? అనే అంశాలే నిజమైన అభివృద్ధికి కొలమానం.ప్రస్తుతం పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడంతో జనాభా ఒత్తిడి కూడా అధికమవుతోంది. దీనికి అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, ప్రజా రవాణా వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే అభివృద్ధి పేరుతో చేపట్టే నిర్మాణాలు భవిష్యత్‌లో కొత్త సమస్యలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో పట్టణాల్లో ఎదురయ్యే వరదలు, రహదారులపై నిలిచిపోయే నీరు, ట్రాఫిక్ సమస్యలు పాలనకు సవాల్‌గా మారుతున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినా కొద్దిపాటి వర్షానికే అవి దెబ్బతింటే నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తడం సహజం. అందుకే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్వహణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.అభివృద్ధి ప్రణాళికల్లో సామాన్యుల అవసరాలకు స్థానం కల్పించాలి. పాదచారులకు ఫుట్‌పాత్‌లు, వృద్ధులు మరియు దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, మహిళలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలు, పిల్లలకు ఆటస్థలాలు అందుబాటులో ఉండాలి. పార్కులు, చెట్ల పెంపకం, చెరువుల పరిరక్షణ వంటి అంశాలను కూడా పట్టణ ప్రణాళికలో భాగం చేయాలి.అధికార యంత్రాంగం మాత్రమే కాదు.. ప్రజలకు కూడా బాధ్యత ఉంది. రోడ్లపై చెత్త వేయకుండా, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తిస్థాయిలో విజయవంతం కాదు. అభివృద్ధి అంటే భవనాల ఎత్తు కాదు.. ప్రజల జీవన ప్రమాణాల ఎత్తు. పాలకులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ, ప్రజలు బాధ్యతాయుతంగా సహకరిస్తేనే సుస్థిరమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుంది. అప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరి.. పట్టణ జీవనం మరింత సౌకర్యవంతంగా మారుతుంది.

# ఫాంహౌస్ కుట్రపై ఉక్కుపాదం!

మొదటి పేజీ తరువాయి)

ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని అన్నారు. అసెంబ్లీ ఎదుట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై కొందరు దాడి చేశారని, స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను సమాజంలోని అన్ని వర్గాలు ఖండించాయని సీఎం పేర్కొన్నారు.

ఫాంహౌస్ వద్ద దండోరా.. ప్రజాస్వామిక నిరసన

ఫాంహౌస్‌లో కుట్రలు జరిగాయని ఆరోపిస్తూ దళితులు అక్కడ నిరసనకు వెళ్లారని సీఎం తెలిపారు. దాడులు చేయాలనే ఉద్దేశంతో వారు వెళ్లలేదని, ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశారని అన్నారు. 'కోర్టు బెయిల్ ఇచ్చినా.. సమాజం ఇవ్వదు'కుట్రకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో కానీ సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని వ్యాఖ్యానించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌పై ప్రజలకు విశ్వాసం

కాంగ్రెస్ అంటే ప్రజలకు నమ్మకం, విశ్వాసమని రేవంత్‌రెడ్డి అన్నారు. గొప్ప లక్ష్యంతో ఆవిర్భవించిన కాంగ్రెస్ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని పేర్కొన్నారు. అణచివేత, వివక్షకు గురైన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్.. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేసిందని సీఎం పేర్కొన్నారు.

# E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

మొదటి పేజీ తరువాయి)

శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# విజయ్ కూటమికి కొత్త పేరు.. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'

మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నూతన కూటమికి విజయ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండో అతిపెద్ద సమావేశం ఇది. ఈ భేటీలో టీవీకే, కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీల అగ్రనేతలు పాల్గొన్నారు. అయితే, ప్రభుత్వానికి వెలుపల నుంచి మద్దతు తెలుపుతున్న సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు.రాబోయే రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో జరగనున్న ఉపఎన్నికల్లో సమష్టిగా పోటీ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మధురాంతకం, ధరాపురం వంటి నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశముంది. కూటమి విధివిధానాలు, ఉమ్మడి కనీస కార్యక్రమం, స్టీరింగ్ కమిటీ ఏర్పాటు వంటి కీలక అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. లౌకికవాదం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూనే, విజయ్ పేరు స్ఫురించేలా "విక్టరీ" అనే పదాన్ని కూటమి పేరులో చేర్చడం గమనార్హం. ఈ కూటమి ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు దీటైన ప్రత్యామ్నాయంగా, మూడో ప్రధాన శక్తిగా ఎదగాలని విజయ్ వర్గం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.



## కాళోజి నారాయణరావు కు నివాళులర్పించిన కలెక్టర్





**నల్లగొండ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**

ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సాహిత్యం ఆచరణీయమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. కాళోజి నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాలోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 1914 సెప్టెంబర్ 9న కర్ణాటకలో జన్మించిన కాళోజీ నారాయణరావు వరంగల్ లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారని, చిన్నప్పటినుండి సాహిత్యం పై పట్టు సాధించారని, విభిన్న భాషలలో ప్రావీన్యులైన కాలోజి నారాయణరావు 1941 లో తన మొదటి కవితను ప్రచురించడం జరిగిందని ,అప్పటినుండి తన తుది శ్వాస విడిచే వరకు సాహిత్యంలో ప్రత్యేకించి తెలంగాణ సాహిత్యంలో వారి ముద్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సమాజాన్ని ఉద్దేశించి వారు రాసిన కవితలు, తెలంగాణ ఉద్యమంలో వారు ప్రశ్నించిన కవితలు,రాష్ట్రాన్ని సాధించడానికి చాలా దోహదపడ్డాయని , ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వారిని గౌరవిస్తూ వారి గుర్తుగా హెల్త్ యూనివర్సిటీకి కాళోజి హెల్త్ యూనివర్సిటీగా నామకరణం చేసిందని తెలిపారు. " మర్రి విత్తనమంత చిన్న పద్యంలో మహా వృక్షమంత అర్థం" కాళోజీ కవితల సొంతమని , అలాంటి సాహిత్యంతో వారి భావజాలం ద్వారా తెలంగాణ సాహిత్యాన్ని తెలంగాణ ప్రజల అందజేశారని అన్నారు .కాళోజి నారాయణరావు సాహిత్యం ఆచరణీయమని వారి ఆశయాలతో అందరూ సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.కాళోజి నారాయణరావు, దాశరథి, సుమతి, వేమన వంటి వారి కవితలు మన జీవన గమనాన్ని శాసిస్తాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్,కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాళోజి నారాయణరావుకు ఘనంగా నివాళులర్పించారు

## ఖరీఫ్ సీజన్ ధాన్యం సరఫరా పై అధికారుల కు సూచనలిస్తున్న కలెక్టర్





**నల్లగొండ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**

ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు .2026 -27 ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ పై బుధవారం ఆయన తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఇబ్బంది పెట్టే పరిస్థితులు రాకుండా, నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఇందుకుగాను అన్ని శాఖలు వారి వారి శాఖల ద్వారా చేసే ఏర్పాట్లన్నీ ముందే చేసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 1 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున, జిల్లాలో సెప్టెంబర్ 25 నాటికి నిర్దేశించిన 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలన్ని కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి మొదటి రోజు నుండే కనీసం 10000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా సంసిద్ధం కావాలని, ఇందుకు అవసరమైన లారీలు, హమాలీలు ,తూకం కొలిచే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అన్ని సిద్ధం చేసుకోవాలని, ఎక్కడ హమాలీల కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు అవసరమైన గోదాములను గుర్తించి సిద్ధం చేయాలని, లారీలను సంసిద్ధం చేయాలని లారీల జాబితాను ముందే సమర్పించాలని చెప్పారు. గత సీజన్ కు ఈ సీజన్ కు ఉన్న మార్పులను కలెక్టర్ తెలియజేస్తూ ఈ సంవత్సరం దాన్యం తీసుకువెళ్లే లారీలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే ప్రతి గన్ని బ్యాగును లెక్కించడం జరుగుతుందని ,సెంటర్ వారిగా ఓపీఎంఎస్ చూసుకోవాలని, కొన్నిచోట్ల దొడ్డు బియ్యం కూడా పండించినందున దొడ్డు బియ్యం కూడా కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ప్రత్యేకించి నకిరేకల్ ,నల్గొండ తదితర ప్రాంతాలలో గోడౌన్లు గుర్తించాలని, సెంటర్ ఇన్చార్జీలు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు . ధాన్యం కొనుగోలు పై శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం గ్రేడ్ -ఏ దాన్యానికి 2461 రూపాయలు, కామన్ వెరైటీకి 2441 రూపాయలను మద్దతు ధర ప్రకటించిందని, అలాగే సన్నధాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. అయితే జిల్లాలో కేవలం సన్న ధాన్యాన్ని మాత్రమే వేయాలని, దొడ్డు ధాన్యం వద్దని రైతులకు ముందు నుండి విజ్ఞప్తి చేయడం జరిగిందని, అయినప్పటికీ కొన్ని చోట్ల దొడ్లు ధాన్యం వేసినట్లు సమాచారం ఉందని, ఇందుకు సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో వివరణ తీసుకోవాలని, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ను ఆదేశించారు. అలాగే దొడ్డు ధాన్యం విత్తనాలు అమ్మిన ట్రడర్ ల పై కూడా చర్య తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా గోడౌన్లలో మరమ్మతులు అవసరమైతే ముందే గుర్తించి చేపట్టాలని ,తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు సిద్ధం చేసుకోవాలని, ధాన్యం సేకరణలో చిన్న తప్పు జరగడానికి వీలు లేదని, తూకం కొలిచే యంత్రాల సామర్థ్యాన్ని ముందే తనిఖీ చేయాలని, హైవేలపై ఉండే వే బ్రిడ్జిలను కూడా తనిఖీ చేయాలని , 48 గంటల్లో గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ పూర్తి చేయాలని, మండల, గ్రామ పరిధిలో నడవని సినిమా థియేటర్లు ,షెడ్లు ,ప్రైవేటు గోదాముల వివరాలను సేకరించాలని, ఇందుకుగాను తక్షణమే డిపిఓ, మున్సిపల్ కమిషనర్లతో లేఖ రాయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ 2026- 27 ఖరీఫ్ ధాన్యం సేకరణ కు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు.పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతినాయక్, డిఎస్ ఓ వెంకటేశ్వర్లు, డిసిఓ మైకేల్ బోస్, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారులు, మార్కుఫెడ్ అధికారులు ,ఎఫ్ సి ఐ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు

## జాతీయ రహదారి--65పై ఆహార పరిరక్షణ అధికారుల తనిఖీలు

**పలు హోటళ్లు, ఢాబాలు, రెస్టారెంట్లలో ప్రత్యేక తనిఖీలు.. 55 కిలోల నాణ్యత లేని ఆహారం ధ్వంసం**

**నల్గొండ: సెప్టెంబర్ 9. విజయ కెరటం ప్రతినిధి**

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా కమిషనర్, TG SAFE ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో జాతీయ రహదారి--65 వెంబడి పలు హోటళ్లు, ఢాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో బుధవారం ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివ శంకర్ రెడ్డి తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, ముడి--వండిన పదార్థాల విభజన, వంటగది పరిశుభ్రత, ఉష్ణోగ్రత నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, పెస్ట్ కంట్రోల్, ఆహార నిర్వహణ సిబ్బంది వైద్య రికార్డులను పరిశీలించారు.చిట్యాల పట్టణంలోని బ్లూ ఫాక్స్ మినర్వా కేఫ్‌లో తనిఖీల సందర్భంగా ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయకపోవడం, ముడి--వండిన పదార్థాలను సరిగా వేరు చేయకపోవడం, తగిన ఉష్ణోగ్రత నియంత్రణ లేకపోవడం, గడువు ముగిసిన/వినియోగ తేదీ దాటిన ఆహార పదార్థాలను నిల్వ చేయడం, వంటగదిలో పరిశుభ్రత లోపించడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం, పెస్ట్ కంట్రోల్,





సిబ్బంది వైద్య రికార్డులను సరిగా నిర్వహించకపోవడం, ఆహార పదార్థాలను నేలపై నేరుగా ఉంచడం వంటి లోపాలు గుర్తించారు. గ్రేవీలు, మాంసం, అల్లం, మాంసం ఉత్పత్తులు, మంచూరియా తదితర 55 కిలోల నాణ్యత లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. సంస్థకు మెరుగుదల నోటీసు జారీ చేసి, 6 నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. జాతీయ రహదారి--65 వెంబడి ప్రజలకు ఆహారాన్ని అందించే హోటళ్లు, ఢాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో ఆహార పరిరక్షణ ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో, నిర్ణీత ఉష్ణోగ్రతల్లో, సరైన విధానంలో నిల్వ చేయాలని, గడువు ముగిసిన లేదా నాణ్యత కోల్పోయిన ఆహార పదార్థాలను వినియోగించరాదని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తనిఖీలు ఇలాగే కొనసాగుతాయని, వ్యాపారులు బాధ్యతాయుతంగా , ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించాల్సిందిగా, లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఉమ్మడి నల్గొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి జ్యోతిర్మయి హెచ్చరించడం జరిగింది.

-- ఆహార పరిరక్షణ విభాగం, నల్గొండ జిల్లా

## నల్లగొండ జిల్లా పూర్వీకుల చరిత్ర తెలియచేయండి కలెక్టర్

**నల్లగొండ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**



నల్గొండ జిల్లాలో శాసనాలు,తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని జిల్లా పర్యాటక శాఖ అధికారికి తెలియజేయండి-జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్. నల్గొండ జిల్లా చరిత్ర, సంస్కృతిని తెలియజేసే అనేక శాసనాలు, తాళపత్ర గ్రంథాలు ఉన్నాయని, అయితే జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఉన్న ఈ శాసనాలు, తాళపత్ర గ్రంథాలు ఎక్కడైనా



గుర్తించినట్లయితే వెంటనే జిల్లా పర్యటక శాఖ అధికారికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. వీటి ద్వారా నల్గొండ జిల్లాకు సంబంధించిన పూర్వ చరిత్రను, సంస్కృతిని తెలుసుకునేందుకు అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు, చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు,ఔత్సాహికులు వారి పరిధిలో శాసనాలకు సంబంధించిన ఫోటోలు, శాసనాలు లేదా తాళపత్ర గ్రంధాలకు సంబంధించిన సమాచారాన్ని, అలాగే శాసనాల ఫోటోలను,తాళపత్ర గ్రంథాలను జిల్లా యంత్రాంగాయానికి తెలియజేయాలని కోరారు. వీటిని సంరక్షించడంతోపాటు, భవిష్యత్తులో వీటి ఆధారంగా నల్గొండ జిల్లా చరిత్ర, సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.వీటి వివరాలను జిల్లా పర్యాటక శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ కి అందజేయాలని వివరాలకు పర్యాటక శాఖ అధికారి ఫోన్ నెంబర్ 80744 87020 కు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026' పోస్టర్‌ను ఆవిష్కరించిన కోమటిరెడ్డి

**నల్లగొండ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు, యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఈ ఛాలెంజ్‌ను నిర్వహిస్తున్నారు. షార్ట్‌ఫిలిం లు, పాటలు, వీడియోల ద్వారా యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం గొప్ప వేదికగా నిలుస్తుందని మంత్రి తెలిపారు.బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ఛాలెంజ్ దోహదపడుతుందని పేర్కొన్నారు.యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026'ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గారు పిలుపునిచ్చారు.

## మెగా వైద్య శిబిరం.

**వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ.**

**సూర్యాపేట సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న 580 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు.**

**సూర్యాపేట పోలీస్ అంతా ఒక కుటుంబం, సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి.**

**సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.**

సూర్యాపేట:పోలీస్ సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి విలువైన సేవలు, పూర్తి రక్షణ కల్పించవచ్చుని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా ఈరోజు సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్‌ఫై హాస్పిటల్ మరియు సూర్యాపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి సంయుక్త సహకారంతో పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు గుండె, ఇతర ఆరోగ్య సమస్యలపై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ గారు ఇతర ఉన్నతాధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బంది ఎంతో పని ఒత్తిడితో, నిర్విరామంగా విధులు నిర్వహిస్తూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారని అన్నారు. అందుకే పోలీస్ శాఖ వారి సంక్షేమానికి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిత్యం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం అని అన్నారు. పోలీస్ సిబ్బంది అంతా ఒకే కుటుంబమని, ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు, పోలీస్ శాఖలోని హోంగార్డుల నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబం లాంటివారని, సిబ్బంది యోగక్షేమాలు, ఆరోగ్యంపై శాఖ నిరంతరం శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. సమాజ రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో ఆనందంగా గడపడంతో పాటు విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని గుర్తుచేశారు. పోలీసుల సంక్షేమాన్ని గుర్తించి ముందుకొచ్చి ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు, సలహాలు అందించిన ఆర్వీ హాస్పిటల్, హెల్త్‌ఫై హాస్పటల్ వైద్య బృందానికి, సూర్యాపేట కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్ పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఉచిత మెగా వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 580 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు చేయించుకున్నారు. మీడియా ప్రతినిధులు సైతం ఈ వైద్య శిభిరం నందు పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డీఎస్పీ లు ప్రసన్న కుమార్, నరసింహ చారి, హెల్త్ ఫై హాస్పటల్ డాక్టర్ చలపతి రావు, ఆర్వీ హాస్పటల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, గైనకాలజీ డాక్టర్ ప్రియాంక, ఆర్థోపెడిక డాక్టర్ భరత్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సత్యం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ వెల్ఫర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ లు సురేష్, అన్వర్, అఖిల్, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సెక్రెటరీ కిరణ్, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్య బృందం, భవాని నర్సింగ్ హోం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజయకెరటం

తెలుగు దినపత్రిక

## జర్నలిస్టుల ఆరోగ్య పథకం హామీని నెరవేర్చండి

### TUWJ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

**ఆదిలాబాద్ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన ఆరోగ్య పథకం హామీని ఇంతవరకు నెరవేర్చకపోవడం విచారకరమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. బుధవారం నాడు ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాలులో జరిగిన, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) ఆదిలాబాద్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్ పథకం అమలుకాకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేసారు. కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక, ఇప్పటికే వందల సంఖ్యలో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ఆరోగ్య పథకాన్ని అమలుచేసి జర్నలిస్టుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల మంజూరీలో కలెక్టర్లు తిరకాసులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే అలాంటి వైఖరికి స్వస్తి పలికి కార్డులను మంజూరీ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జర్నలిస్టుల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని ఆయన ఖండించారు. జిల్లాలో 15మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, వారికి మంజూరు అయిన అక్రెడిటేషన్ కార్డులను లాక్కోవడం సహించరానిదన్నారు. వెంటనే అక్రమ కేసులను ఉపసంహారించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. అలాగే జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న జర్నలిస్టులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో విచారణ జరిపించడం సహించరానిదని విరాహత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఈ ఇద్దరు అధికారుల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేసారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి పరిస్థితుల్లో, పవిత్రమైన మీడియా వృత్తికి పూర్వ వైభవం దక్కించేందుకు గాను నైతిక విలువలతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని ఆయన సూచించారు. ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో తమ సంఘం ఎంతో బలోపేతంగా ఉందని, అయితే సభ్యుల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా జిల్లా నూతన కమిటీ చిత్తశుద్ధితో సేవలందించాలని ఆయన సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ప్రకాష్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం నాయకుడు హన్మంత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, కార్యదర్శి దేవేందర్ లతో పాటు జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

**శాంతి సంఘ సభ్యుల సమావేశంలో నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి..**

నల్లగొండ సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి: రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, శాంతి సంఘ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాల భద్రత తదితర అంశాలపై శాంతి సంఘ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు.ప్రతి గణేష్ మండపాన్ని నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో కూడా మండపాల వద్ద భద్రత ఉండేలా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఊరేగింపుల్లో మద్యం సేవించి పాల్గొనడం, మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నివారించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత అత్యుత్సాహానికి లోనై ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, వదంతులు, ఫేక్ న్యూస్, రెచ్చగొట్టే పోస్టులు, అభ్యంతరకర వీడియోలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు లేదా కంటెంట్‌ను ప్రచారం చేయవద్దని డీఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తామని, వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠ, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల విషయంలో నిబంధనలు ఉల్లంఘించరాదని సూచించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నినాదాలు, వ్యాఖ్యలు లేదా కార్యక్రమాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. "వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలి. ప్రతి ఒక్కరి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకుందాం" అని డీఎస్పీ శివరాం రెడ్డి కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్డీఓ అశోక్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అమేర్, శాంతి సంఘ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, వేరెల్లి చంద్రశేఖర్, కర్నాటి యాదగిరి, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సీఐలు రాజశేఖర్ రెడ్డి, ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, శివకుమార్, ఇతర పోలీస్ అధికారులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు -- రౌడీ షీటర్లకు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి హెచ్చరిక..






**నల్గొండ: సెప్టెంబర్ 9 విజయ కెరటం ప్రతినిధి**

నల్గొండ పట్టణంతో పాటు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి తెలిపారు.రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నల్గొండ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు బుధవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్గొండ టౌన్ పరిధిలోని 75 మంది రౌడీ షీటర్లతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం 150 మంది రౌడీ షీటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, గతంలో నేరాలకు పాల్పడిన వారు తమ నేర ప్రవృత్తిని పూర్తిగా విడిచిపెట్టి, ఇకపై ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సాధారణ పౌరులుగా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. వినాయక ఉత్సవాల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గొడవల్లో జోక్యం చేసుకున్నా లేదా నేరాలకు పాల్పడినా పీడీ యాక్ట్ (గూణ చూమ్)తో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు సబ్ డివిజన్ పరిధిలో 125 మంది రౌడీ షీటర్లపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసి,సంబంధిత ఏం.ఆర్.ఓ ల దగ్గర రూ.2 లక్షల బైండ్ ఓవర్ మరియు 6 నెలల కాలపరిమితితో బైండ్ ఓవర్ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ బైండ్ ఓవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని తెలిపారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకుని కుటుంబంతో కలిసి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా పోలీసులు సహించబోరని డీఎస్పీ కె. శివరాం రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, శివప్రసాద్, ముత్తయ్య, పోలీస్ సిబ్బంది షకీల్, శంకర్, అంజయ్య, బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

## 7దొంగతనం కేసులు ఛేదించిన కోదాడ పోలీస్.







**కోదాడలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్**

**- 60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం.**

**సూర్యాపేట సెప్టెంబర్ 9 విజయకేరటం ప్రతినిధి**

జిల్లా పోలీసు కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో అరెస్ట్ వివరాలు, కేసుల దర్యాప్తు వివరాల ను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు వెల్లడించారు. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు మరియు జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడు : పట్నం శెట్టి రాజు ఏ రాజీ రెడ్డి, వయస్సు 41 సంవత్సరాలు, వృత్తి: కారు డ్రైవర్, నివాసం పాపిరెడ్డినగర్ కాలనీ, జగద్గిరిగుట్ట. ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశం తో 2009 లో ఖమ్మం పోలీస్ స్టేషన్ లో మొదటగా సైకిల్ దొంగతనం చేసి జైల్ కు వెళ్ళినాడు ఆ తరువాత 2015, 2016 సంవత్సరం లో మొదటగా జగద్గిరి గుట్ట పరిధిలో లో అయిదు ఇళ్ళలో రాత్రి పూట దొంగతనాలు చేసినాడు. ఇట్టి కసులలో జగద్గిరి గుట్ట పోలీసు వారు పట్టుకొని రీమాండ్ కు పంపించినారు. నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రి సమయంలో తన కారును నిర్మానుష్య ప్రదేశంలో నిలిపి, నడుచుకుంటూ వెళ్లి తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవాడు. నిందితుడు స్క్రూడ్రైవర్, చేతి గ్లౌజులకు బదులుగా షూ సాక్స్ ఉపయోగిస్తూ, ఇంటి ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించేవాడు. బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును దొంగిలించేవాడు. దొంగిలించిన ఆభరణాలలో కొన్నింటిని అమ్మడం, కొన్నింటిని కరిగించడం, మరికొన్నింటిని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టడం ద్వారా వచ్చిన డబ్బును తన వ్యక్తిగత అవసరాలకు మరియు అప్పుల చెల్లింపులకు వినియోగించేవాడు. అలాగే తన కారు అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ఝా 28 దీ 7770కు బదులుగా నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ఖా 07 +జ 1612ను ఉపయోగిస్తూ పోలీసులకు అనుమానం రాకుండా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడు. కోదాడ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్న విషయమై పోలీస్ శాఖ కోదాడ పట్టణంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలను సేకరించి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించడం జరిగింది. అరెస్టయిన నిందితుడు రాజు ఏ రాజిరెడ్డి. ఇతను వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు హైదరాబాద్ నుంచి ప్రయాణికులను కారులో కోదాడకు తీసుకువచ్చి, రాత్రి సమయంలో కోదాడలోనే ఉండేవాడు. నిర్మానుష్య ప్రాంతంలో కార్ పార్కింగ్ చేసి తెల్లవారుజామున పట్టణంలో సంచరిస్తూ, తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడేవాడు. నిందితుడు కోదాడ పట్టణంలో 2021 నుండి ఇప్పటి వరకు 10 దొంగతనాలకు పాల్పడినాడు, 2026 సంవత్సరంలో 7 ఇండ్లలో దొంగతనాలు చేశాడు. నమ్మదగిన సమాచారం పై ఈరోజు ఉదయం సుమారు 08:00 గంటల సమయంలో, నిందితుడు దొంగిలించిన బంగారు వస్తువులను విజయవాడకు తీసుకెళ్లి విక్రయించాలనే ఉద్దేశంతో తన కారులో సూర్యాపేట నుండి కోదాడ పట్టణంలోని ఫ్లైఓవర్ మీదుగా హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్న సమయంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండటాన్ని గమనించాడు. పోలీసులను చూసి భయపడి వాహనాన్ని వెనక్కి తీసుకొని తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కిలోని కవర్లలో బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదు లభించాయి. అలాగే స్క్రూడ్రైవర్లు మరియు షూ సాక్స్‌లు కూడా లభించడంతో అనుమానం మరింత బలపడింది. అనంతరం నిందితుడు కోదాడ పట్టణంలో తాను చేసిన దొంగతనాల గురించి వెల్లడించాడు. నిందితుడు ఉపయోగించిన ఎశీఅఝు ాఝిఓవ కారు మరియు ఎ×ఖూ¯31 5+ మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు పంపడం జరుగుతుంది. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ శ్రీ కె. నర్సింహ, ఐపీఎస్ మాట్లాడుతూ, నేరాలకు పాల్పడిన వారు ఎప్పటికైనా చట్టానికి చిక్కక తప్పదని అన్నారు. ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, కాలనీల్లోని ప్రధాన మార్గాల్లో కూడా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలారం సిస్టమ్ పెట్టుకోవాలని అన్నారు, ఎక్కువ రోజులు ఇండ్లకు తాళం పెట్టీ వెళ్లేవారు విలువైన వస్తువులు, డబ్బు ఇంట్లో ఉంచవద్దు అని కోరారు, ఇరుగు పొరుగు వారికి, స్థానిక పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని అన్నారు. దొంగతనాల నివారణలో ప్రజలు పోలీసులకు సహకరిస్తూ పోలీసు శాఖతో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తూ, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని ఎస్పీ తెలిపారు. దొంగతనాల కేసు చేయించడంలో పర్యవేక్షణ చేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, నిధితుణ్ణి అరెస్ట్ చేయడంలో బాగా పని చేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివంశంకర్, సిసిఎస్ ఎస్ఐ లు హరికృష్ణ, సాయిరాం, ఎస్ఐ అజయ్ కుమార్, సిసిఎస్ సిబ్బంది వెంకన్న, విద్యాసాగర్, మల్లేష్, సతీష్, శివ, ప్రభాకర్, మంజుల ని అభినందించి రివార్డ్ అందించడం జరిగినది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528